# ప్రజా ముచ్చట

తెలుగు దినపత్రిక

మా ప్రతీ అక్షరం – ప్రజల ముచ్చటే



ప్రజా ముచ్చట తెలుగు దిన పత్రిక

విలేకర్లు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.

అనుభవం, ఆసక్తిగలవారు

99086 89674 లో సంప్రదించగలరు



హైదరాబాద్ | గురువారం,మే22,2025 | ఎడిటర్: పండ్ల నాగరాజు | పేజీలు: 4 వేల: 1


## పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో
# కేంద్రం విఫలమయింది

- ఒక గొప్ప అవకాశాన్ని భారత్ కోల్పోయిందని వ్యాఖ్య
- ప్రధానికి అండగా ఉండాల్సిన సమయంలో కిషన్ రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారు
- పాకిస్థాన్‌తో వ్యవహరించే తీరులో మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయింది
- దేశ సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో తాము ఎలాంటి రాజకీయాలు చేయబోము
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం తలొగ్గింది



హైదరాబాద్,మే21,) దాయాది దేశం పాకిస్థాన్‌కు తగిన రీతిలో గుణపాఠం చెప్పడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అమెరికా వంటి దేశాల ఒత్తిళ్లకు తలొగ్గి, పాకిస్థాన్ విషయంలో కీలక అవకాశాలను కేంద్రం చేజార్చుకుందని ఆయన ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.పాకిస్థాన్‌తో వ్యవహరించే తీరులో మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో అమెరికాతో సహా పలు ప్రపంచ దేశాల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదురైనా, వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యుద్ధాన్ని కొనసాగించి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో తాము ఎలాంటి రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు.ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి ఎంతో వన్నె తెచ్చారని, భారతదేశాన్ని ఒక ఆర్థిక శక్తిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని రేవంత్ రెడ్డి కొనియాడారు.

## ప్రజా సమస్యల నుంచి దృష్టి
# మరల్చేందుకే నోటీసులు

- కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవహారంలో కేసీఆర్ కు నోటీసులు
- కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై కేటీఆర్ స్పందన
- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై నాటకాలాడుతున్నాయని ధ్వజం
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు



## కేంద్రంపై కోర్టుకెక్కిన
# తమిళనాడు..

- ఎన్ఈపీని అమలు చేయడంలేదని నిధులు ఆపేసిందని ఆరోపణ
- రాష్ట్రానికి రూ.2,151 కోట్లు విడుదల చేసేలా ఆదేశించాలని సుప్రీంలో పిటిషన్
- త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం స్టాలిన్



## నోటీసులకు భయపడే
# ప్రసక్తే లేదు...


- కాళేశ్వరం విచారణ నోటీసులపై మాజీ మంత్రి ఈటల ఘాటు వ్యాఖ్యలు
- కేసీఆర్ హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని ప్రకటన
- అధికారికంగా ఎలాంటి నోటీసులు అందలేదు
- బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్,మే21,() కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ నుంచి తనకు అందబోతున్న నోటీసుల అంశంపై బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తాను నోటీసులకు భయపడబోనని, కేసీఆర్ హయాంలో జరిగిన విషయాలను అవసరమైతే వెల్లడిస్తానని ఆయన హెచ్చరిక ధోరణిలో వ్యాఖ్యానించారు. ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ ఈటల పలు కీలక అంశాలను ప్రస్తావించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తనతో పాటు మంత్రులుగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కడియం శ్రీహరి వంటి నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని, వారికి



అప్పటి పరిస్థితులు తెలియవా అని ఈటల ప్రశ్నించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ
# ఎన్ కౌంటర్...



- 28 మంది మావోయిస్టుల హతం
- నారాయణపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్
- మావో అగ్రనేత నంబాల కేశవరావు మృతి చెందినట్టు సమాచారం
- ఇంకా కొనసాగుతున్న ఎదురుకాల్పులు



## పాకిస్థాన్‌లో ట్రెండింగ్‌లో
# రాహుల్ గాంధీ

- ఆపరేషన్ సిందూర్'పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- పాక్ ఆర్మీకి ముందే సమాచారం ఇచ్చారంటూ ఆరోపణలు
- రాహుల్ వ్యాఖ్యలు పాక్ మీడియాలో ప్రముఖంగా ప్రసారం

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు పాకిస్థాన్‌లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' గురించి ఆయన లేవనెత్తిన ప్రశ్నలను పాకిస్థాన్ మీడియా తమకు అనుకూలంగా మలచుకుంటూ కథనాలను ప్రసారం చేస్తోంది.

# తిరుమల భద్రతకు "యాంటీ డ్రోన్" అస్త్రం..

- తిరుమల భద్రతకు ఇజ్రాయెల్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ!
- సీఎం ఆదేశాలతో తిరుమల కొండలపై 80 శాతానికి పచ్చదనం పెంపు
- స్విమ్స్‌కు అదనంగా రూ.71 కోట్ల ఆర్థిక సాయం, వైద్య సిబ్బంది నియామకం
- టీటీడీలో అన్యమతస్థులకు వీఆర్ఎస్ లేదా బదిలీకి చర్యలు



తిరుమల శ్రీవారి ఆలయ భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయ పరిసరాల్లో డ్రోన్లు పనిచేయకుండా నిరోధించే అత్యాధునిక "యాంటీ డ్రోన్ టెక్నాలజీ"ని వినియోగించాలని తీర్మానించింది. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి, ఆమోదముద్ర వేశారు. సమావేశానంతరం ఈవో జె. శ్యామలరావు మీడియాకు వివరాలు వెల్లడించారు.తిరుమల ఆలయ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, డ్రోన్ల ద్వారా ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన యాంటీ డ్రోన్ సాంకేతికతతో పాటు మరికొన్నింటిని పరిశీలించి, అత్యుత్తమమైన దానిని ఎంపిక చేయాలని బోర్డు నిర్ణయించినట్లు ఈవో శ్యామలరావు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమల కొండలపై ప్రస్తుతం ఉన్న 68.14 శాతం పచ్చదనాన్ని అటవీశాఖ ద్వారా 80 శాతానికి పెంచేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే దశలవారీగా రూ.4 కోట్లు విడుదల చేయనున్నారు.అలాగే, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి, నారాయణవనం, కపిలతీర్థం, నాగాలాపురం, ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందించేందుకు ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించారుతుళ్లూరు మండలం అనంతవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు.రాయలసీమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రస్తుతం ఇస్తున్న రూ.60 కోట్లకు అదనంగా మరో రూ.71 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని బోర్డు నిర్ణయించింది.

## జూన్ 21న విశాఖకు
# ప్రధాని మోడీ..



- ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనిత
- జూన్ 21న విశాఖకు ప్రధాని మోడీ
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొననున్న ప్రధాని
- సాగర తీరంలో ఏర్పాట్లపై హోంమంత్రి అనిత సమీక్ష
- అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీన విశాఖ సాగర తీరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితర ఉన్నతాధికారులతో కలిసి హోంమంత్రి అనిత బీచ్ రోడ్డులో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతాపరమైన అంశాలను, ఇతర ఏర్పాట్లను ఆమె కూలంకషంగా పరిశీలించారు. యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రజలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

# కత్తి ఉపేందర్ మాదిగకు దళితరత్న అవార్డు ప్రధానం



పెన్ పహాడ్/ప్రజా ముచ్చట, మే 21: మండల పరిధిలోని ధూపహాడ్ గ్రామానికి చెందిన కత్తి ఉపేందర్ మాదిగకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 2025 వ సంవత్సరం మహనీయుల ఉత్సవ కమిటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ఇటుక రాజు మాదిగ నాయకత్వంలో బాబు జగ్జీవన్ రావ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆ ఇద్దరు మహనీయుల ఆశయ సాధనకు అంకితమై షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న టి ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కత్తి ఉపేందర్ కు ఇటుక రాజు మాదిగ చేతుల మీదుగా సికింద్రాబాద్ లోని క్లాసికల్ ఫంక్షన్ హాల్ లో దళిత రత్న అవార్డును ప్రధానం చేయడం జరిగింది. అవార్డు గ్రహీత కత్తి ఉపేందర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ ల అడుగుజాడల్లో నడుస్తూ అణగారిన ప్రజలకు సేవ చేస్తూ వారి హక్కుల పోరాటంలో ముందు ఉంటానని, అణగారిన ప్రజల బాధ్యత నాపై ఈ అవార్డుతో పెరిగిందని, నా మాదిగ జాతి పోరాటంలో ముందు ఉంటానని నాకు అవార్డు కోసం నా పేరు ప్రతిపాదించిన ఇటుక రాజు మాదిగ కు కృతజ్ఞతలు, ఉద్యమాభివందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను కనకరాజు మాదిగ, ముంజల విజయ్ మాదిగ, మహిళా నాయకురాలు మేరీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# "దిద్దకుంట్ల" ఆశయ సాధనకు కృషి చేయాలి



పాలకవీడుప్రజాముచ్చట: మండలంలోని గుడుగుంట్ల పాలెంలో సిపిఎం సీనియర్ నాయకుడు దిద్దకుంట్ల నారాయణ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ నారాయణ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం హుజూర్నగర్ డివిజన్ అధ్యక్షుడిగా రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడిగా సిపిఎం మండల కార్యదర్శిగా వివిధ హోదాల్లో పనిచేస్తూ వ్యవసాయ కార్మికుల రైతుల పేద ప్రజల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పనిచేసిన గొప్ప వ్యక్తిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మాజీ ఎంపిటిసి దొంగల వెంకటయ్య తోరికొండ వెంకటేశ్వర్లు కృష్ణారెడ్డి నందయ్య రామ్ రెడ్డి దిద్దకుంట్ల పిచ్చమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిగూడెంలో రాజీవ్ గాంధీ వర్ధంతి



వేములపల్లి, ప్రజా ముచ్చట: మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఘనంగా మాజీ ప్రధాని అపర మేధావి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎలికట్టి మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎలికట్టి మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు తన సొంత ఖర్చుతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఆయన అన్నారు. అన్నదాత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ అని ఆయన అన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. నా జీవితం కాంగ్రెస్ పార్టీకి అంకితం అని మోహన్ రావు తెలియజేశారు. లక్ష్మీదేవి గూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎలికట్టి మోహన్ రావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఈ వర్ధంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అన్నా, రాజీవ్ గాంధీ అన్న ఆయనకు చాలా ప్రేమ అని ఆయన తెలియజేశారు. నా రక్తంలో లో ఉంది కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి మరింత వేగవంతం జరుగుతుందని ఎలికటి మోహన్ రావు అన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# రైతు కుటుంబానికి రక్షణ కరువు

**- బజారును ఆక్రమించి నిర్మాణం**
**-తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు**
**-ట్రాక్టర్ నడవకుండా అడ్డుపడడం- అడుగుతే ఆయుధాలతో బెదిరించడం**
**-సిసి రోడ్డు కబ్జా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికారులు**



తెలంగాణ పత్రిక,మిర్యాలగూడ మే 21అసలే చిన్న బజారు ఆ బజారులో 10 మీటర్ల సిసి రోడ్డు నాలుగు మీటర్లు లో గోడ మెట్లు కబ్జా. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మెరుగు జానీ నివాసం ఉంటున్న బజారులో 10 ఫీట్లు సీసీ రోడ్డు ప్రభుత్వం నిర్మిస్తే నాలుగు ఫీట్ల వరకు సీసీ రోడ్డుపై అక్రమంగా ప్రహరి గోడ,మెట్లు నిర్మించి కాలనీ వాసుల వెహికల్స్ వెళ్లకుండా ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గత నెల 28వ తారీఖు నాడు బాధితుడు మేరు జానీ అను వ్యక్తి బజారు రోడ్డుపై మెట్లు కట్టి ట్రాక్టర్ వెళ్లకుండా అడ్డుపడుతున్నారని సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కి వినతి పత్రం అందచేశారు. అధికారులు సిబ్బందితో కలిసి రావడం సిసి రోడ్ కబ్జా చేసిన వ్యక్తులకు నోటీసులు జారీ చేసి వారాలు గడుస్తున్న సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్యను పరిష్కారం చేయండి అని కార్యదర్శి అడుగగా పై అధికారులు అడగమని చెప్పడం పై అధికారులను సంప్రదిస్తే ఇది మా పరిధి కాదు మేం చేయలేం అని ఎంపీడీవో అధికారి చేతులెత్తేయడం చాలా ఆశ్చర్యకరంగా మారింది. గ్రామ కార్యదర్శి నుండి జిల్లా అధికారుల వరకు నిర్లక్ష్యం చేస్తూ రైతు కుటుంబానికి వ్యవసాయం చేసుకోకుండా యంత్రాలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా అడ్డుపడి మరణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్న కబ్జాదారులపై ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వారిపై తగు చర్యలు తీసుకొని రోడ్డుపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి రైతు కుటుంబానికి,బజార్ బాటసారులకు న్యాయం చేయగలరని కోరారు.

# ఆధునిక భారత స్వాప్నికుడు రాజీవ్ గాంధీ:తూముల సురేష్ రావు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి పండ్లు పంపిణీ చేస్తున్న తూముల సురేష్ రావు, పార్టీ నాయకులు

పెన్ పహాడ్ /ప్రజా ముచ్చట,మే 21:ఆధునిక భారత స్వాప్నికుడు దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో గ్రామశాఖ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు అరటి పండ్లను పంపిణీ చేసి మాట్లాడుతూ అతిపిన్న వయసులోనే ప్రధానమంత్రి పదవిని చేపట్టిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుకు నాడు నాటిన అభివృద్ధి మొక్కలు నేడు వృక్షాలై ఫలాలు అందిస్తున్నాయి అని అన్నారు. ఆయన దూర దృష్టితో సైన్స్ అండ్ టెక్నాలజీ , ఆర్థిక వ్యవస్థ సరళీకృతం చేయడం, పరిశ్రమలకు రాయితీలు, పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టత వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఆయన యువతరంలో శక్తివంతమైన మార్పును ఆకాంక్షించి కంప్యూటర్ యుగానికి నాంది పలకడంతో ఇప్పుడు దేశం అభివృద్ధి దిశలో ప్రయాణిస్తుంది అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అర్తి కేశవులు, మాజీ జడ్పిటిసి పిన్నని కోటేశ్వరావు, గ్రామశాఖ అధ్యక్షులు దొంగరి సైదులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య శివ నాయక్, దొంగరి జనార్ధన్, భద్రయ్య, అత్తి రామకృష్ణ, నరేష్, పిన్నని కృష్ణయ్య, మల్లేపల్లి వీరభద్రం, గోపగాని అశోక్, మాతంగి ప్రవీణ్, బొల్లేపల్లి ఉదయ్, పెదపోలు సునీల్, చింతమల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకవీడులోఘనంగా రాజీవ్ వర్ధంతి



పాలకవీడుప్రజాముచ్చట:పాలకవీడు మండలకేంద్రములో బుధవారం మాజీప్రధాని,భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మండలకాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు,మాజీఎంపిపి భూక్యా గోపాల్ నాయక్, మాజీ జడ్పీటిసి మాలోట్ మోతిలాల్ నాయక్ కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి జితేందర్ రెడ్డి,నరసింహరావు,ఎలంచెర్వు బాల్ రెడ్డి,మీసాల ఉపేందర్,నీమా నాయక్,మొహమ్మద్ ఖాసిం,సందీప్,సుబ్బుగౌడ్, బుడిగే సైదులు,శ్రీను,బుర్రి వెంకయ్య,జార్జి చంద్రయ్య,మామిడి సురేష్,రమేష్,గురవయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ సుంకాలు, చైనా స్మార్ట్ కర్మాగారాలు, మన 'మేకిన్ ఇండియా'

%దశాబ్దాల పాటు వివిధ దేశాలకు తరలించిన వస్తూత్పత్తి పరిశ్రమలను అమెరికాకు తిరిగి రప్పించి%ొ%అమెరికన్లకు ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రపంచ దేశాలపై సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. ప్రభుత్వ పరిపాలనా వ్యయంలో దుబారాను అరికట్టే పేరిట ఎలాన్ మస్క్ నేతృత్వంలో ఏర్పరిచిన 'డిపార్టమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ' వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ, ఆఖరుకు ఫెడరల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలను కోత పెట్టిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం అమెరికన్లకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించడానికి కాదనేది స్పష్టం అవుతున్నది. ఆర్థికంగా, వాణిజ్యపరంగా నానాటికి బలోపేతం అవుతూ అమెరికన్ ప్రపంచాధిపత్యానికి సవాలుగా మారుతున్న చైనాను దెబ్బతీసి ఒంటరిపాటు చెయ్యడమే ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ట్రంప్ మిడిసిపాటుతో ప్రకటించిన సుంకాలు వార్తాపత్రికల పతాక శీర్షికలుగా చలామణీ అవుతుంటే చైనా తన మానాన తాను దేశ వస్తూత్పత్తి రంగాన్ని, ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా, బలీయంగా పెంపొందించుకుంటూ పోతున్నది. రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఎ.ఐ), డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాలలోకి పెట్టుబడులు ఆహ్వానించడం ద్వారా చైనా సంప్రదాయిక లేబర్ ఇంటెన్సివ్ వస్తూత్పత్తి విధానం నుండి పూర్తి స్థాయి యాంత్రీకరణ, హైటెక్ విధానంతో కూడిన రాత్రి కర్మాగారాల వైపునకు మళ్ళించింది. యాంత్రీకరణ విప్లవం ద్వారా చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దశ, దిశలను మార్చేస్తున్న వైనాన్ని గురించి ఇప్పటికే వివిధ కథనాలు వెలువడ్డాయి. మరోవంకన వస్తూత్పత్తి రంగంలో అభివృద్ధి సాధించడానికి 'మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, స్టార్టప్ ఇండియా'ల పేరిట మోడీ ప్రభుత్వం రకరకాల పథకాలను ప్రకటించినా ఇవి ఆచరణలో ఆశించిన ఫలితాలు సాధించడంలో విఫల నమూనాలుగా మిగిలాయి. నయా ఉదారవాద విధానాల భ్రమల నుండి బయటపడి శాస్త్ర–సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుని నిబద్ధతతో ఆచరించడం ద్వారా మాత్రమే భారతదేశం స్వావలంబన సాధించగలుగుతుందన్న తెలివిడి, స్పృహ పాలకులకు కలగనంత వరకు పరిస్థితులలో గుణాత్మక మార్పులు రావు. చైనా కారుచౌక శ్రామిక శక్తికి నెలవు అని దశాబ్దాలుగా పేరు పడింది. కానీ గత పదేళ్లగా చైనా వ్యూహాత్మకంగా అత్యున్నత స్థాయి వస్తూత్పత్తి రంగానికి కేంద్రంగా మారింది. 2015లో చైనా ప్రభుత్వం రాబోయే పదేళ్ళలో రోబోటిక్స్, కృత్రిమ మేధ తదితర పది అత్యున్నత సాంకేతిక రంగాలలో ప్రగతి సాధించి 'మేడిన్ చైనా–2025 సాధించాలని ప్రణాళిక రూపొందించుకున్నది. ఇందుకు అనుగుణంగా శాస్త్ర పరిశోధనా రంగాలలో అద్భుత ఫలితాలు సాధించడానికి అనువుగా భారీ పెట్టుబడులు పెట్టడం, తేటలికగా బ్యాంక్ రుణాలు అందేలా చూడడం వంటి చర్యలు చేపట్టింది. ఒక్క 2023వ సంవత్సరంలోనే రోబోటిక్స్ రంగంలో శాస్త్ర పరిశోధనకు 1.4 బిలియన్ డాలర్లు కేటాయించింది. అలాగే ఇందుకు తగిన సాధన సామాగ్రిని సమకూర్చుకోవడం కోసం భారీ ఎత్తున పారిశ్రామిక రుణాలు అందేలా చూసింది. ఇవాళ చైనా ప్రపంచంలోనే అత్యధిక ఫ్యాక్టరీ రోబోట్ల వినియోగదారుగా ఎదిగింది. సగటున 10,000 మంది కార్మికులకు 392 రోబోట్ల వినియోగంతో ప్రపంచ సగటు వినియోగం కన్నా మూడు రెట్లు ఆధిక్యతతో ముందున్నది. చైనాలో దేశవ్యాప్తంగా పరిశ్రమలను కృత్రిమ మేధ, రోబోటిక్స్‌తో అనుసంధానించే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నది. అధునాతన సెన్సార్ల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన వస్తూత్పత్తి చేస్తున్నది. తద్వారా సరసమైన ధరలకే నాణ్యమైన వస్తువులు అందించగలుగుతున్నది. అమెరికా సుంకాల విధింపును లెక్క చెయ్యకుండా ఐరోపా యునియన్ దేశాలకు, ఇతర వర్ధమాన దేశాలకు చైనా ఉత్పత్తులు భారీగా ఎగుమతి చేయగలుగుతున్నది. జనాభాలో వయసు మళ్ళిన వారి శాతం పెరుగుతూ ఉండటం, యువతరం ఫ్యాక్టరీలలో పనుల కన్నా ఉన్నత చదువుల మీద దృష్టి కేంద్రీకరించడం మూలంగా చైనాలో దేశీయ పరిశ్రమల్లో భారీఎత్తున యాంత్రీకరణ అమలు చేయడం అనివార్యమైంది. చైనా ప్రభుత్వం దేశవ్యాప్తంగా 30 వేల 'స్మార్ట్' ఫ్యాక్టరీలను నిర్మించింది. పరిశ్రమలను డిజిటలైజ్ చేసి, కృత్రిమ మేధను అనుసంధానించడం ద్వారా ఈ అధునాతన 'స్మార్ట్' ఫ్యాక్టరీలను తీర్చిదిద్దింది. వీటికి తోడు మరో 1200 'అడ్వాన్స్‌డ్' స్థాయి ఫ్యాక్టరీలను 230 'ఎక్సలెంట్' స్థాయి ఫ్యాక్టరీలను నిర్మించడం ద్వారా వస్తూత్పత్తి రంగం ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేసింది. ఈ స్మార్ట్ ఫ్యాక్టరీలు అధికోత్పత్తి సాధించడానికి వీలుగా పారిశ్రామిక ఉత్పత్తి వ్యవస్థలను 'అడ్యాన్స్‌డ్ కంప్యూటింగ్', 'డేటా ఎనలిటిక్స్'తో అనుసంధానించారు. సాంకేతిక పరిభాషలో దీనినే పారిశ్రామిక అంతర్జాలం (ఇండిస్టియల్ ఇంటర్నెట్) అంటారు. 5జి ప్లస్ ఇండిస్టియల్ ఇంటర్నెట్ల అనుసంధానం ద్వారా ప్రధాన పారిశ్రామిక వాడల్లో భారీ స్థాయి ఉత్పత్తిని సాధించే అనేకానేక పైలట్ ప్రాజెక్టులను చేపట్టింది చైనా ప్రభుత్వం. 2024లో ఈ వ్యవస్థలను ఎ.ఐ తో అనుసంధానించడం ద్వారా నాణ్యత, నిర్వహణా సామర్థ్యం మెరుగుపరచడంతోపాటు స్వయం నిర్ణయం తీసుకునే శక్తిని కూడా కల్పించారు. జాతీయ స్థాయిలో, ప్రావిన్స్‌ల (రాష్ట్రాలు) స్థాయిలో స్మార్ట్ ఫ్యాక్టరీలు, డిజిటల్ వర్క్‌షాప్‌లను ఎ.ఐ తో అమసంధానించే కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. చైనా ప్రభుత్వం చేపట్టిన అత్యాధునిక యాంత్రీకరణ రాత్రి కర్మాగారాలు నెలకొల్పడానికి దారితీసింది. ఈ కర్మాగారాలు మానవ జోక్యం లేకుండా పూర్తి స్థాయి కృత్రిమ మేధ, రోబోటిక్స్, అడ్వాన్స్‌డ్ సెన్సార్ల ఆధారంగా పనిచేస్తాయి. మానవ శ్రమతో ఉత్పత్తి చేపట్టడానికి రాత్రిపూట పట్టపగల్లా వెలుగునిచ్చే విద్యుత్ కాంతి, కార్మికులకు విశ్రాంతి గదులు వంటివేవీ ఈ కర్మాగారాలకు అవసరం పడవు.

# ఫాసిజంపై సాధించిన విజయం...

మే 9వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఫాసింజపై సాధించిన విజయం ఎనభయ్యవ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నారు. 1945వ సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున సోషలిస్టు రష్యాకు చెందిన రెడార్మీ హిట్లర్ ఫాసిస్టు మూకలను నిర్ణయాత్మకంగా ఓడించి బెర్లిన్‌లోని రీచ్‌స్టాగ్ (జర్మనీ పార్లమెంట్ భవనం)పై ఎర్రజెండాను ఎగురవేశాయి. జాత్యహంకారంతో యావత్ ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలని మొదలుపెట్టిన యుద్ధంలో అనివార్యంగా ఓటమిని చవిచూడనున్నానని ముందుగానే గ్రహించిన నాజీ హిట్లర్ ఏప్రిల్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులలో ఫాసిజంపై సాధించిన విజయానికి అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. 1920వ దశకంలో నెలకొన్న తీవ్ర ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి, రాజ్యాధికారంపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక శక్తులు ఫాసిజాన్ని ఆశ్రయించాయి. ప్రపంచవ్యాపంగా అనేక దేశాలలో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తి, కమ్యూనిస్టు ఉద్యమాలు ఉధృతంగా పెరుగుతూ వచ్చిన దశాబ్దాల కాలం అది. రష్యాలో 1917లో మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం కావడం, సమాజంలో అన్ని రకాల దోపిడీలను నిర్మూలించడంలో గొప్ప ముందంజ వేయడం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రజానీకానికి స్ఫూర్తినిచ్చింది. అధికారం కోల్పోయిన పాత పాలక వర్గాలు రెచ్చగొట్టిన అంతర్యుద్ధాన్ని, చుట్టుముట్టిన సామ్రాజవాద శక్తులను నవజాత రష్యన్ సోషలిస్టు సమాజం విజయవంతంగా ఎదుర్కొని అధిగమించిన తీరును ప్రత్యక్షంగా గమనించారు. ఈ పరిణామాలతో స్ఫూర్తి పొందిన జర్మనీ, హంగేరీ దేశాలలోని కార్మికవర్గం ఆయా దేశాల్లోని పాలక వర్గాలను అధికారం నుండి కూలదోయడానికి ప్రయత్నించింది. వివిధ కారణాల రీత్యా ఈ తిరుగుబాట్లు విఫలం అయ్యాయి. కానీ పాలక బూర్జువా వర్గం ఈ పరిణామాలతో అప్రమత్తం అయ్యింది. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మిక వర్గానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేజిక్కించుకోకుండా చూడడానికి పాలక శక్తులు రకరకాల ఫాసిస్టు ఎత్తుగడలను అవలంభించాయి. ఇటలీలో ముస్సోలిని, జర్మనీలో హిట్లర్, జపాన్‌లో



హిరోహితోలు ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహించారు. ఆయా దేశాల్లో ఫాసిజం తలెత్తడానికి దేశీయ బూర్జువా వర్గంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం కూడా ఎంతగానో తోడ్పడింది. ఫోర్ట్, రాక్‌ఫెల్లర్, కోకోకోలా వంటి బడా పారిశ్రామిక సంస్థలు ఫాసిజం అభివృద్ధి చెందడానికి బహిరంగంగానే తోడ్పాటునిచ్చాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే ఫాసిజం అంటే 'కార్మికవర్గ విప్లవాలకు బెదిరి ఫైనాన్స్ పెట్టుబడి బాహాటంగా ఉగ్రవాద నియంతృత్వానికి పాల్పడడం' అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక యోధుడు అయిన జార్జి డెమిట్రోవ్ నిర్వచించాడు. హిట్లర్ జర్మనీని పున: సైనికీకరించడం గురించి మొదట్లో పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం ఆందోళన పడలేదు. ఈ భూమ్మీద నుండి కమ్యూనిజాన్ని తుడిచిపెడతాను అన్న హిట్లర్ లక్ష్య ప్రకటనను విశ్వసించారు. వాళ్ళు కోరుకునేది కూడా అదే. నాడు బ్రిటన్ ప్రధానిగా ఉన్న విన్‌స్టన్ చర్చిల్ కమ్యూనిజం పట్ల తనకు ఉన్న తీవ్ర విద్వేషాన్ని ఎన్నడూ దాచిపెట్టుకోలేదు. కమ్యూనిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడని ఈ పెట్టుబడిదారీ దేశాలు గట్టిగా నమ్మాయి. ఈ గుడ్డి నమ్మకంతోనే హిట్లర్ యూరప్ దేశాల మీద యుద్ధానికి దిగినప్పుడు అతన్ని నిలవరించడానికి ప్రయత్నించలేదు. హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టడానికి 'ఫ్రంట్' కడదాం రమ్మని స్టాలిన్ ప్రతిపాదించినపుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు గట్టిగా తిరస్కరించాయి. హిట్లర్ తన సైన్యాన్ని ఫ్రాన్స్ మీదకు నడిపించి ఆ దేశాన్ని ఓడించి, బ్రిటన్‌ను బెదిరించిన తరువాత ఆ దేశాలు కళ్లు తెరిచాయి, హిట్లర్ ప్రమాదాన్ని గ్రహించాయి. అయినా 'ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం' అని స్టాలిన్ పదేపదే చేసిన ప్రతిపాదనలను నిర్లక్ష్యం చేశాయి. సోషలిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడన్న ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఆశలతోనే ఫాసిజంపై రెండవ దిక్కు నుంచి సాగించాల్సిన యుద్ధాన్ని అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు రెండేళ్లు ఆలస్యంగా మొదలుపెట్టాయి. ఇన్ని ఆటంకాల మధ్యన హిట్లర్ నాజీ సైన్యాన్ని ఎదుర్కొని, ఫాసిజాన్ని మట్టి కరిపించడంలో సోషలిస్టు రష్యా కీలక పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో 2 కోట్ల మంది రష్యన్లు అసువులు బాశారు. 30 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. దేశీయ పరిశ్రమలు, వ్యవసాయం ఘోరంగా దెబ్బతినిపోయాయి. ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు తదితర మౌలిక వసతులు శిధిలాల గుట్టలుగా మారాయి. స్టాలిన్ గ్రాడ్, లెనిన్ గ్రాడ్, కురుస్క్ ప్రాంతాలలో జర్మన్ ఫాసిస్టు మూకలను ఎదుర్కొని తిప్పికొట్టడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. మాతృ దేశానికి చెందిన ప్రతి అంగుళం భూభాగాన్ని నిలబెట్టుకోవడానికి సోవియట్ సైన్యాలు భీకర పోరాటం సాగించాయి. రెడార్మీ సాధించిన ఈ విజయాలు చూశాక అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు హిట్లర్‌ను ఓడించవచ్చన్న నమ్మకం కలిగింది. హిట్లర్ సైన్యాన్ని సోవియట్ భూభాగం నుంచి నిర్ణయాత్మకంగా, విజయవంతంగా వెనక్కి తిప్పికొట్టడం మొదలవడం చూసి అప్పుడు పై మూడు దేశాలు జర్మనీ మీద రెండవ దిక్కు నుంచి దాడులు మొదలుపెట్టాయి. సోవియట్ రెడార్మీ కేవలం తమ భూభాగం నుంచి నాజీ సైన్యాన్ని తిప్పికొట్టడంతో సరిపెట్టుకోకుండా కమ్యూనిస్టు అంతర్జాతీయ స్ఫూర్తితో జర్మనీ రాజధాని బెర్లిన్ వైపుగా దూసుకుపోతూ అంతకు ముందు హిట్లర్ పాదాక్రాంతం చేసుకున్న యూరప్ దేశాల భూభాగాలను ఒకటొకటిగా విముక్తం చేశాయి. ఈ క్రమంలో ఫాసిస్టు ఆక్రమిత దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు వీరోచిత పాత్ర పోషించాయి. ఆయా దేశాల్లో ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలు పెంపొందించడానికి, గెరిల్లా దాడులు నిర్వహించడానికి కృషి చేశాయి. అత్యంత ధైర్య సాహసాలతో సాగిన ఈ కృషికి విస్తృతమైన మన్నన లభించింది. హిట్లర్ ఓటమి చవిచూశాక నాజీ సైన్యం ఆక్రమించుకున్న అనేక దేశాల్లోని ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసుకొని తమ తమ దేశాలను సోషలిస్టు పంథా వైపు నడిపించే కృషి చేపట్టాయి. ఈ క్రమంలోనే అనేక తూర్పు యూరప్ దేశాలు కమ్యూనిస్టు దేశాలుగా అవతరించాయి. ఫ్రాన్స్, స్పెయిన్ వంటి పశ్చిమ యూరప్ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు గణనీయమైన రాజకీయ శక్తిగా ఎదిగాయి. కమ్యూనిజం ప్రాభవాన్ని, సోషలిజం విస్తరణలను దృష్టిలో ఉంచుకుని బూర్జువావర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా యూరప్ పున:నిర్మాణానికి ఒక 'మాస్టర్ ప్లాన్' రూపొందించింది. పెట్టుబడిదారీ దేశాలు కూడా ఈ కాలంలోనే అనేక సామాజిక సంక్షేమ పథకాల అమలుకు పూనుకున్నాయి. 'సంక్షేమ రాజ్యా'ల భావన ఉనికిలోకి వచ్చింది. ఫాసిజాన్ని నిర్ణయాత్మకంగా ఓడించడంలో సోవియట్ సోషలిస్టు రష్యా, రెడార్మీ నిర్వహించిన మహత్తర పాత్రను తుడిచిపెట్టేదానికి పెట్టుబడిదారీ వర్గాలు శతథా ప్రయత్నించి విఫలమయ్యాయి. చరిత్రను వక్రీకరించడానికి సాంస్కృతిక రంగాన్ని ఒక సాధనంగా వాడుకున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం మీద హాలీవుడ్ నిర్మించిన సినిమాలు ఇందుకు ఒక ఉదాహరణ. ఈ యుద్ధంలో అమెరికా, బ్రిటన్‌లు పోషించిన పాత్రను ఎక్కువ చేసి చూపిస్తూ, రెడార్మీ నిర్ణయాత్మక పాత్రను కావాలనే తక్కువ చేసి చూపడమో లేదా పూర్తిగా విస్మరించడమో చేశాయి.

# మితిమీరిన వీధి కుక్కల దాడులు



ఇటీవల వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం మన దేశం నుంచే ఉంటుండటం ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఈ వీధికుక్కల కాటు వల్ల ఏటా 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తుండటం, 30 నుంచి 60 శాతం మృతుల్లో అభం శుభం తెలియని చిన్నారులు ఎక్కువగా ఉంటుండటం మానవత్వం వున్న ప్రతి ఒక్కరి హృదయాలను తీవ్రంగా కలిచివేసే విషయం. అదేవిధంగా యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్-2001 ప్రకారం ఈ వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి వాటికి స్టెరిలైజేషన్ టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీటికి టీకాలు వేయడంలో విఫలం అవుతుండటం ప్రజల పాలిట శాపంగా మారి, ఈ వీధి కుక్కల దాడులు వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలకు ఏ మాత్రం గ్యారంటీ లేకుండా పోతోంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ వీధి కుక్కల కాటు నుంచి దేశ ప్రజానీకానికి విముక్తి కలిగించాలంటే తక్షణమే మన కేంద్ర ప్రభుత్వం వారు యుద్ధ ప్రాతిపదికన కదలాలి. సంబంధిత శాఖ వారికి ఈ వీధి కుక్కల దాడులను అరికట్టే చర్యలకు పూనుకునేలా సిఫారసు చేయాలి. లేకపోతే ప్రతి ఏడాది వేలాది మంది విలువైన ప్రాణాలు ఈ వీధికుక్కల కాటు వల్ల అనంత వాయువుల్లో కలిసిపోతాయి. వీధి కుక్కల దాడుల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

# మధ్యతరగతి ఎందుకు కొనలేకపోతున్నది?

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించకపోవడం, కొత్త ఉపాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి.

# విశాఖ భూములు కారుచౌకగా కట్టబెడుతున్నారు

ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో విశాఖలో అత్యంత విలువైన భూములను అతి తక్కువ ధరలకే కట్టబెట్టే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిగమ్నమైంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో విశాఖలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను చడీచప్పుడు కాకుండా కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఇటీవల టాటా కన్సల్టెన్సీ సర్వీస్ లిమిటెడ్ (టిసిఎస్)కి హిల్ నెంబర్ 3లో 21 ఎకరాల భూములను కేటాయించారు. ఉర్సా కంపెనీకి దాని పక్కన, కాపులుప్పాడలోనూ భూమిని కేటాయించారు. టిసిఎస్ రూ.1370 కోట్ల పెట్టుబడులతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. టిసిఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. ప్రతిష్టాత్మక టిసిఎస్ ఇట్లాంటి ఒప్పందానికి ఎలా అంగీకరించింది? ఇది ప్రభుత్వం అత్యుత్సాహమా? వాస్తవం ఏంటనేది ప్రజలకు తెలియజేయాలి. ఆ పక్కనే ఉర్సా కంపెనీకి భూములు కేటాయించడం పట్ల కూడా ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఈ కంపెనీని 2025 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. దీనికి కార్పొరేట్ గుర్తింపు (రిజిస్ట్రేషన్ నెంబర్ 193897) ఇచ్చారు. రూ.10 లక్షల పెట్టుబడితో ఏర్పడిన కంపెనీ ఇది. రెండు తెలుగు రాష్ట్రాల్లోను వేల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకున్నారు? ఈ కంపెనీకి ఇద్దరు మాత్రమే డైరెక్టర్లుగా వున్నారు. ఐటి రంగంలో కనీసం గుర్తింపు లేని కంపెనీ. ఇలాంటి కంపెనీకి టిసిఎస్ పక్కనే కేటాయిస్తే అంతర్జాతీయ గుర్తింపు వస్తుందనే కుట్ర దాగి వుందా? లేదా ఏ లాభాపేక్షతో ఉర్సాకు భూములు కేటాయించారు? ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వంలో అనుకూలురు వుంటే కోట్లాది విలువ చేసే భూములను పొందవచ్చనేది ఉర్సా ఉదంతం తెలియజేస్తున్నది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములపై అనేక అనుమానాలను విశాఖ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిజానిజాలను రాష్ట్ర ప్రభుత్వమే ప్రజలకు చెప్పాల్సి వుంది. ఉర్సా కంపెనీకి కేటాయించిన భూమి అత్యంత విలువైన భూమి. ఈ కంపెనీలతో జరిగిన ఒప్పందాలు అత్యంత రహస్యంగా వుంచాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? మొదట ఎకరా 99 పైసలకే కేటాయించారని ప్రసార మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఎకరా 99 పైసలకు కాదని బదులిచ్చింది. ఒక కంపెనీతో ఎం.ఒ.యు కుదుర్చుకున్నప్పుడు ఆ కంపెనీ చరిత్ర తెలుసుకోవాలి. చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేస్తుందా? లేదా? అనే విశ్వాసనీయమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా భూములు కేటాయించినట్లు అర్థమౌతుంది. ఉర్సా క్లస్టర్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటయిన కంపెనీ అని, ఈ కంపెనీ రూ.5196 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు చేసి 2500 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తురదని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. విశాఖ ఐ.టి పార్కు దగ్గర హిల్ నెంబర్ 3లో 3.50 ఎకరాలు, కాపులుప్పాడలో 56 ఎకరాలు, మొత్తంమీద 60 ఎకరాలు కేటాయించారు. ఈ భూములు వేల కోట్ల రూపాయల ఖరీదైనవి. కాపులుప్పాడలో కేటాయించిన 56 ఎకరాలకు ఎకరా 50 లక్షలకే కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే 28 కోట్లకే కేటాయించారు. హిల్ టాప్‌పై ఉన్న 3.50 ఎకరాలను ఎకరా కోటి చొప్పున 3.50 కోట్లకే భూములు కేటాయించారు. ఇంత కారుచౌకగా ఊరు, పేరు లేని కంపెనీకి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. ఇంత అడ్డగోలుగా భూములు కేటాయించి దానిని సమర్థించుకొనే ప్రయత్నం చేయడం దుర్మార్గమైనది. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250 ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. విశాఖ ఆర్థిక రాజధాని. ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన భూములు, కొండలను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రభుత్వ స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టీగా వుండి పరిరక్షించాల్సింది పోయి పెట్టుబడిదారులకు లీజుల పేరుతో కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారు. భూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ ఆర్కే బీచ్‌లో ఉన్న 13.43 ఎకరాల భూమిని లూలు కంపెనీకి కట్టబెట్టారు. అదాని డేటా సెంటర్‌కు 190 ఎకరాల భూమిని హిల్‌టాప్‌లో కేటాయించారు. గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ దగ్గర 250




ఎకరాలు కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా నగరం నడిబొడ్డున విప్రో, సత్యం కంప్యూటర్స్‌కు ఇదే తరహాలో జరిగింది. తరువాత అది టెక్ మహేంద్ర కంపెనీగా మార్పు చెందింది. ఐటి సెజ్ హిల్ టాప్‌లో ఇప్పటికే ఐటి కంపెనీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ఏర్పడిన కంపెనీల్లో ఎంత మందికి ఉపాధి కల్పిస్తామన్నారు? ఎంత మందికి కల్పిస్తున్నారు? వంటి వివరాలను బహిర్గతం చేయాలి. ఇలావుండగా, ఇటీవల కాలంలో అక్కడే ఉన్న ఐటి కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు సరిగ్గా జీతాల చెల్లింపులు జరగడంలేదని ఆందోళనలకు దిగారు. ఏ.పి పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందాలంటే, ఉపాధి అవకాశాలు రావాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే కీలకమైనది. నేడున్న కేంద్ర ప్రభుత్వానికి మన రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు చాలా కీలకమైనది. కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తే ప్రత్యేక హోదా సాధించవచ్చు. ఫలితంగా అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా కూటమి నాయకులు ప్రభు భక్తి చాటుకుంటున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విశాఖలో ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు అత్యంత విలువైనవి. ఈ ప్రాంతం పచ్చని కొండలతో నిండి వుంటుంది. ఇప్పుడు వాటిని ధ్వంసం చేస్తున్నారు. విశాఖ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలి. వికసిత ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణం చాలా కీలకమైనది విజన్ 2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రటించింది. ఈ దృష్ట్యా ఉర్సాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలి. లేదంటే ప్రజాగ్రహానికి గురికావల్సి వస్తోంది.